'అబ్బ! నేను తిన్నాలేరా. నువ్వు తిను.'– అంటూ అన్నం పెడ్తున్న ఆ చేతిని అట్లాగే గట్టిగా పట్టుకున్నాడు పిచ్చయ్య. 'అమ్మా. నువ్వు తినలేదు, నువ్వు తినకపోతే నేనూ తినను. అంతే.' గట్టిగా అని, మొండికేస్తాడు. చివరికి రాజమ్మ నిజాన్ని వప్పుతుంది. 'నాకు ఆకలిగా లేదులేరా. నాకు వద్దుగాని నువ్వు తిను నాయనా' అని బ్రతిమాలింది, కొడుకుని. పిచ్చయ్యకి ఈ మధ్యన విషయాలు తెలుస్తున్నాయి.


'అమ్మా! అట్లా వీల్లేదు. మా అందరి ఆకలినీ తీర్చటానికే నువ్వు నీ ఆకలిని చంపుకుంటున్నావు. అందుకే– ఇప్పుడు నీకు ఆకలిగా లేదు. అంతేగదమ్మా!' అని కళ్ళనీళ్ల పెట్టాడు పిచ్చయ్య– ఏడ్చాడు బిగ్గరగా.

'ఏమంత వయస్సు రాకపోయినా, నీ ఆలోచనలు అంతదూరం వెళ్ళాయా తండ్రీ! ఆ కట్టుకున్న పెద్దమనిషి ఏనాడూ కష్టం సుఖం కనుక్కోక పోయినా, ఈనాటికి ఎదిగివచ్చి ఆ బాధ్యత తల్చి నీ బుజాన వేసుకుందామనుకుంటున్నావా నాయనా!?' అంది రాజమ్మ శోకం ముంచివేయగా. ఆమె కడుపు చెరువయింది. ఆమె శోకతప్తనయనాలు చాలాకాలం తర్వాత ఆనందబాష్పాలు రాల్చాయి. మళ్ళీ వర్షం కుండపోతగా కురవటం ప్రారంభమయింది.



# నాకు నచ్చిన నా కథ

నిప్పుతో చెలగాటం ముప్పుకు మూలం అన్న సత్యం అందరూ ఎరిగినదే. అయినా – తనవరకు వచ్చేసరికి ఆ విషయాన్ని విస్మరించడం సహజం .... ఉచ్చనీచాలను మరచి ఎదుటి వ్యక్తులను స్వార్థంకోసం వుపయోగించుకోవాలనుకుంటే ఫలితం ఎలా ఉంటుందో – కాంతమ్మే నిదర్శనం! 'నిప్పు కాలింది!' అంటూ తరువాత గోలపెట్ట ప్రయోజనం వుండదు.... ఈ కథలోని కాంతమ్మ, అండాళమ్మలు మనకు నిత్యజీవితంలో తరచు తటస్థపడుతూనే ఉంటారు.



— "తిరుమలశ్రీ"

అయిదు వందలకు పైగా ప్రచురింపబడిన నా కథలలో నాకు నచ్చిన కథలు చాలా వున్నా 'విజయ' మాసపత్రిక 1977 సంచికలో ప్రచురించబడిన ఈ కథనే ఎంచుకోడానికి కారణం 'పాఠకులే న్యాయనిర్ణేతలు'గా నిర్వహించిన కథల పోటీలో ఈ కథ ద్వితీయ బహుమతి పొందడమే!

# నిప్పు కాలింది !

నిప్పు ముట్టుకుంటే కాలక మానదు.

కాలుతుందని తెలిసీ ముట్టుకునేవాళ్ళు ఫలితం అనుభవించక తప్పదు. ఆనక విచారించీ ప్రయోజనం వుండదు....

## 1

నవ్వుకుంటూ థియేటర్ నుంచి బయటకు వస్తోన్న ఆ జంటను చూసి కాంతమ్మ మొదట తెల్లబోయింది. ఆ తరువాత ఆముదం తాగినదానిలా ముఖం పెట్టింది..... సినిమా చూస్తూన్నంతసేపూ ఆవిడ మనసు మనసులో లేదు. సుందరమూర్తితో పంకజం సినిమాకు వెళ్ళడమంటే సామాన్య విషయం కాదు!


సుందరమూర్తి చురుకయిన కుర్రాడు. పాతికకు మించని వయసు. ఆరు వందలు మించిన జీతమూను. ఆ ఆరు వాటాల లోగిలిలో మూణ్ణెల్ల క్రితం ఒక వాటాలో అద్దెకు దిగాడు అతను.

ఇంటి యజమానురాలు కాంతమ్మ వయసు నలభయ్ లోపే. పదేళ్ళ క్రితం భర్త పోవడంతో బరువు బాధ్యతలు ఆమెపైన పడ్డాయి. ఏకైక సంతానం రజనికి పద్దెనిమిదేళ్ళు. కాలేజీలో చదువుతోంది... భర్త మిగిల్చిన ఆస్తి ఆ ఇల్లూ, ఎకరం మాగాణీను. ఇల్లు కొంచెం పెద్దదే కావడంతో దానిని ఆరు వాటాలుగా కేటాయించి ఆ ఇంటిని అద్దెకు ఇచ్చివేసింది కాంతమ్మ.

తక్కిన వాటాలలో వుంటున్న కుటుంబాలు రెండింటలో పెళ్ళి కెదిగిన ఆడపిల్లలు వున్నారు. ఒక అమ్మాయి పేరు పంకజం. రజనితో పాటే కాలేజీలో చదువుతోంది. మరో ఇంటిలోని పిల్ల సావిత్రి. హైస్కూలుతోనే స్వస్తి చెప్పి ఇంటిలో ఏవో చేతిపనులు నేర్చుకుంటోంది. ఆ ఇద్దరూ ఇంచుమించు రజని ఈడువాళ్ళే-

సుందరమూర్తి వచ్చినప్పటినుండీ పంకజం, సావిత్రుల తల్లిదండ్రుల కళ్ళు అతనిమీదే వున్నాయన్న సంగతి కాంతమ్మ ఎరుగును. ఆ మాటకొస్తే ఆవిడకూ అలాగానే వుంది. ఎర్రగావున్న యాపిల్‌పండును చూస్తే నోరూరినటు సుందరమూర్తిని చూస్తూంటే ఏవేవో వూహలు ఆవిడ మనసులో రేగాయి.






(1988 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

---

పిల్లాడు బుద్ధిమంతుడిలా కనిపిస్తున్నాడు. మంచి జీతం తెచ్చుకుంటున్నాడు. పైగా తమ కులమేనాయె. తనకో మగపిల్లాడు లేడు. ఆ అబ్బాయిని తన కుటుంబంలో కలుపుకుంటే బావుంటుంది. పిల్ల సుఖపడుతుంది.... సమయం చూసి అతన్ని కదపాలనుకుంటున్నది కాంతమ్మ.

తన ఆలోచన ఇలా వుండగా అనుకోకుండా సుందరమూర్తిని పంకజంతో సినిమాహాలు దగ్గర చూడటంతో కంగారుపడిందావిడ. ఆ పిల్ల అతన్ని ఎక్కడ వలలో వేసుకుంటుందో నన్న భయం పట్టుకుంది. వెంటనే ఏదైనా చేయకపోతే ఆ అబ్బాయి తనకు అందకుండా పోవచ్చును.

ఆ రాత్రంతా ఆ ఆలోచనతోనే జాగరణచేసిన కాంతమ్మ చివరి కేదో నిర్ణయానికి రావడంతో తేలికపడ్డ మనసుతో కన్ను మూసింది.

తెల్లవారుతూనే అండాళమ్మ ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకూర్చుంది కాంతమ్మ.

ఆ చుట్టుపక్కల ఇళ్ళలో పనిచేసే ఏభయ్యేళ్ళ అరవావిడ అండాళమ్మ. గున్న ఏనుగు ఎలా వుంటుందని ఎవరినైనా ప్రశ్నిస్తే, టక్కున ఆమెను చూపిస్తారు ఉదాహరణగా. భర్త పోవడంతో తెలిసినవాళ్ళ ఇళ్ళలో పనులు చేసుకుంటూ గడుపుకుంటోంది. పిల్లాజెల్లా లేరు. అరవయాసతో మాట్లాడుతూ వుంటుంది.

గత జన్మలో అండాళమ్మ నారదుడైనా అయివుండాలి, లేదా ఏ న్యూస్ పేపర్ రిపోర్టరో అయివుండాలని చాలామంది గాఢ నమ్మకం. కిట్టనివాళ్ళు కొందరు అండాళమ్మ నోట్లో నువ్వుగింజ నానదంటారు. కాని అది శుద్ధ అబద్ధమని నిరూపిస్తూ నువ్వుగింజ నానటమే కాక మొలకెత్తి క్షణాలలో మహా వృక్ష మయిపోతుంది. కొందరు ఆవిడకు 'న్యూస్ బులెటిన్' అని ముద్దుగా పేరు పెడితే, మరికొందరు ఆవిడ పరిచయమయ్యాక వార్తాపత్రికలు కొనడం మానివేసారని వదంతి.

నిత్యమూ ఏదో ఒక వేళలో ఆ ఆరువాటాల లోగిలికి వచ్చి లోకాభి రామాయణం పఠించనిదే ఆవిడకు పొద్దుపోదు. వార్తలు చేరవేసి, సేకరించి ఎవరైనా ఏదైనా పెడితే తినడమో, తీసుకువెళ్ళడమో చేస్తూ వుంటుంది.

అండాళమ్మ రాకతో ఆప్యాయంగా పలకరించి వడలు పెట్టి, కాఫీ ఇచ్చింది కాంతమ్మ.

"ఫలానా వీటిలో ఇప్పుడుదా త్రాగి వస్తున్నమ్మా. పెద్దముండను, జాస్తి తిన్న వొళ్ళుకు పొత్తుకోదు" అంటూనే లోటాడు కాఫీ ఖాళీచేసేసింది అండాళమ్మ.

ఆమాటా ఈమాటా చెప్పి అసలు విషయానికి దిగింది కాంతమ్మ. "పాపం! సుందరమూర్తి మంచి కుర్రాడిలాగే వున్నాడు! ఏదో సరదాకొద్దీ పంకజంతో సినిమాలకూ, షికార్లకూ వెళ్ళాడనుకో, అందులో తప్పేముంది చెప్పండి! అస్తమానం వాళ్ళిద్దరూ షికార్లు కొట్టడమూ, బీచ్‌ల వెంట తిరగడమూ ఎవరో చూశారట. ఆ మాత్రానికే వాళ్ళపైన నిందలు మోపాలా! నేనూ వాళ్ళను రెండుమూడు సార్లు చూసాననుకోండి-సినిమాలకు వెళ్ళడం-అంతలోనే వాళ్ళను అనుమానించాలని ఎక్కడ వుంది! ఏదో వయసులో వున్న వాళ్ళు ముచ్చటపడ్డారే అనుకో. లోకం ఎందుకు కోడై కూయాలి?...."

అండాళమ్మ అసలు పాయింట్ పట్టేసింది-

"ఏదో మీతో కాబట్టి చెప్పాను. మళ్ళీ ఎక్కడా అనబోకండి సుమా!" అంటూ హెచ్చరించింది.

అంత ఘాటైన వార్త ఆ మధ్య ఎక్కడా దొరకలేదేమో-అండాళమ్మకు విమానం ఎక్కినట్టుగా వుంది. ఎప్పుడెప్పుడు అక్కడినుండి బయటపడదామా అని ఆతృతగా వుంది.

"అబ్బో, పొద్దు ఎక్కిపొతే పూడిస్తే మన కెందుకమ్మా కాంతమ్మా! నాన్‌దా పోయొస్తాను" అంది లేస్తూ-



తృప్తిగా నవ్వుకుంది కాంతమ్మ. ఒక్కొక్కసారి అండాళమ్మలాంటి వాళ్ళ అవసరం ఎంతగా వుంటుందో ఇప్పుడే తెలిసివచ్చింది ఆవిడకు-

## 2

అండాళమ్మ దెబ్బకు అదిరిపోయాడు సుందరమూర్తి-పంకజంతో తాను సినిమాలకు, షికార్లకు వెళుతున్నాడన్న వార్త గుప్పుమనడంతో హడలిపోయాడు. అదీ అండాళమ్మ పనేనని తెలుసుకున్నాడు.

ఆరోజు తాను ఏదో సినిమాకు వెళ్ళాడు. కౌంటర్ వద్ద క్యూ హను మంతుడి తోకలా వుండడంతో నిరాశగా దిక్కులు చూస్తూ వుంటే పంకజం కనిపించింది. ఇంటి దగ్గర ఎన్నిసార్లు ఎదురుపడినా కళ్ళతో చూసుకోవడమే కాని పలకరించుకోలేదు ఎప్పుడూను-ఆ రోజైనా బావుండదని స్నేహపూర్వ కంగా నవ్వాడు తాను. ఆమె తనకు కూడా టికెట్టు తీసిపెట్టడంతో ఇద్దరూ ఒకేచోట కూర్చున్నారు హాలులో. ఆ సమయంలో ఎవరైనా చూసి వుండొచ్చును. అంతకు మించి తాను ఏమీ ఎరుగడు. ఆ పుకార్ల ప్రభావం ఎలా వుంటుందోనని భయపడ్డాడు సుందరమూర్తి.

కాంతమ్మ దగ్గరనుండి కబురు రావడంతో బెదిరిపోయాడు, ఆమె ఇల్లు ఖాళీచేయమంటుందేమోనని. మరోచోట ఇల్లు దొరకడం కల్ల. బ్రహ్మచారి అవడంతో ఎవరూ ఇల్లు ఇవ్వడంలేదు. 'ఇక్కడ ఎలాగో దొరికిందనుకుంటే ఇదెక్కడి గొడవరా దేవుడా!' అనుకున్నాడు. అండాళమ్మను నాలుగు తన్నా లన్నంత కోపం వచ్చింది.

సుందరమూర్తిని చూసి చిరునవ్వుతో కుశలప్రశ్నలు వేసింది కాంతమ్మ. అతని ప్రాణం కొద్దిగా కుదుటపడింది. పంకజంతో అతనికి సంబంధం వున్న దన్న పుకార్లను ఇన్‌డైరెక్ట్‌గా రిఫర్‌చేసింది. లోకులకూ, కాకులకూ తేడా లేదంది. ఆ లోగిలిలోని ఆడపిల్లలకు కొంచెం దూరంగా వుండడం మంచిదని పరోక్షంగానే సలహా ఇచ్చింది.

"అసలు నిన్ను పిలిపించిన విషయమేమిటంటే, మా రజనికి ఇంగ్లీషు గ్రామర్ కొంచెం కష్టంగా ఉంటోందట-నువ్వు ఇంగ్లీషులో ఘటికుడవని విన్నాను. రోజూ సాయంత్రంపూట ఓ గంటసేపు అమ్మాయికి తెలియనిది ఏదో నేర్పుదూ" అంది చివరికి-

ఆమె పిలిచి చీవాట్లుపెట్టి ఇల్లు ఖాళీచేయమంటుందేమోనని భయపడుతూ వచ్చిన సుందరమూర్తి, ఆమె పలుకులు వినడంతో గుండెలనిండా గాలి పీల్చు

కున్నాడు. కాంతమ్మ ప్రతిపాదనకు సంతోషంగా అంగీకరించాడు. ఆ విధంగా నయినా ఆవిడను మంచిచేసుకుంటే, ఇల్లు ఖాళీచేయవలసిన ప్రమాదం వుండ దనుకున్నాడు.

"ఏం కావలసినా మొహమాటపడకుండా అడగవయ్యా! మా ఇంట్లోకి వచ్చిపడ్డాక నీవు పరాయివాడివి ఎలాగవుతావ్?" అన్నదావిడ.

రజని సహజంగా అందంగా వుంటుంది. అమెతో పరిచయమయితే అతను సులభంగా విడిచిపెట్టడనీ, ఆ విధంగా కట్నం బెడద తప్పే అవకాశం కూడా వున్నదనీ ఆలోచించింది ఆవిడ.

● ● ● ●

సుందరమూర్తి దగ్గర రోజూ ట్యూషన్ చెప్పించుకోవడానికి ఒక పట్టాన వొప్పుకోలేదు రజని. అసలు కారణం చెప్పడం కాంతమ్మకు ఇష్టంలేదు. ఏదో చెప్పి ఎలాగయితేనేం కూతుర్ని వొప్పించింది. సుందరమూర్తి కూడా అన్నమాట ప్రకారం రోజూ రజనికి తెలియని సబ్జెక్టు చెప్పసాగాడు. రజని సాయంత్రం అరున్నరయేసరికి పుస్తకాలు పట్టుకుని అతని గదికి వెళ్ళేది. ఎనిమిదికల్లా తిరిగి వచ్చేది.

పంకజం కాని, సావిత్రిగాని అండాళమ్మ పుణ్యమా అంటూ సుందర మూర్తి వంక కన్నెత్తి చూడటానికి కూడా భయపడుతున్నారు. తన ఎత్తు ఫలించి నందుకు కాంతమ్మ సంతోషించింది. అప్పుడప్పుడు సుందరమూర్తిని ఇంటికి పిలిపించి కూతురు చదువు గురించి మాట్లాడుతూ వుండేది. ఆమె అసలు వుద్దేశ్యం వేరు. ఎప్పటికప్పుడే పెళ్ళి విషయం కదపాలని పిలిచేది. కాని, తీరా అతను వచ్చేసరికి ఆ సంగతి ఎత్తడానికి ధైర్యం చాలేదికాదు. మరేదో మాట్లాడి పంపించేది.

ఇంతలో సుందరమూర్తి, రజనీల స్నేహం ముదరడమేకాక, రజని కాలుజారడం వరకు కూడా వచ్చింది వ్యవహారం.

ఒకానొక (అ)శుభసమయాన విషయం గ్రహించిన కాంతమ్మకు గుండె ఆగినంత పనయింది. ఇక ఆలస్యంచేస్తే ప్రమాదమని గ్రహించింది. ఆ రాత్రి సుందరమూర్తిని పిలిపించింది.

"అమ్మాయికి నెల తప్పిందట. అయిందేదో అయిపోయింది. కడుపు చించు కోక ముందే మీరిద్దరూ పెళ్ళిచేసేసుకోవాలి. లేకపోతే కాళ్ళమీద పడే ప్రమాదముంది" అంది.



'ఎవరి కాళ్ళమీద?' అన్నట్టు చూసాడు అతను.

"నాకు ఎప్పుడో మా అక్కకూతురుతో నిశ్చయమయిపోయింది. వచ్చే ఏడు ఆ పిల్ల చదువు పూర్తి అవుతోంది. మా పెళ్ళి జరుగుతుంది" అన్నాడు. చల్లగా, మెల్లగా.

బట్టతలమీద తాటికాయ పడ్డట్టు అదిరిపడింది కాంతమ్మ.

"అయితే రజనిని ఎందుకు పాడుచేసావ్?" అంది పొంగివస్తూన్న కోపాన్ని అపుకుంటూ.

"నిజం చెప్పాలంటే – మీ అమ్మాయే నన్ను పాడు చేసింది" అన్నాడతను తొణక్కుండా.

కాంతమ్మ కళ్ళకు కొత్తగా కనిపించాడు సుందరమూర్తి .... తన కలలు కాల్చివేసిన సుందరమూర్తి....తన ఆశలు మసిచేసిన సుందరమూర్తి.

కూతురి జీవితం నాశనంచేయవద్దని అతని చేతులు పట్టుకుని బ్రతిమ లాడింది అవిడ. తన తప్పేమీ కాదన్నట్టు ప్రవర్తించాడతను.

అదే సమయంలో అండాళమ్మ, "కాంతమ్మా!" అంటూ ఎందుకో రావ డంతో చటుక్కున అతని చేతులు విడిచేసింది.

సుందరమూర్తి అండాళమ్మవంక అదోలా చూస్తూ వెళ్ళిపోయాడు.

## 3

దగాపడిన కాంతమ్మ విచారిస్తూ కూర్చోలేదు. వెంటనే తగిన సంబంధం చూసి రజనికి ముడిపెట్టేయ్యాలనుకుంది. ఇప్పటికే రజనీ, సుందరమూర్తుల వ్యవహారం అందరి నోళ్ళలోనూ నానుతున్నట్లు అవిడ ఎరుగును. అయితే పెళ్ళయ్యాక వాళ్ళనోళ్ళు మూతలుపడతాయి అనుకుందే గాని, ఇలా జరుగు తుందని ఆవిడకేం తెలుసు? దానికితోడు మర్నాడు సుందరమూర్తి అఫీసుకు నెల్లాళ్ళు సెలవుపెట్టి వూరికి చెక్కేసాడు. ఊళ్ళో పుకార్లూ, రజని కడుపూ పెరగకముందే పెళ్ళి జరిపించేయాలని ఆరాటపడింది. పోనీ అబార్షన్ చేయించు దామా అంటే రజని ఒప్పుకోకపోవడం మాట అటుంచి ఎటుతిరిగి ఎటు వస్తుందోనన్న భయం తనకూ ఉన్నదాయె.

పేరయ్యగారు తెచ్చిన సంబంధం బాగానే వుంది. వాళ్ళకూ రజని నచ్చ డంతో, కట్నాలవద్ద కూడా ఏమీ ఇబ్బందిలేకపోయింది. తాంబూలాలు సయితం పుచ్చుకున్నారు. త్వరలోనే ముహూర్తం పెట్టేసుకోవాలనుకున్నారు.

అయితే–

మూడురోజుల తరువాత పేరయ్యగారు మోసుకొచ్చిన వార్తకు కాంతమ్మకు మతిపోయింది. కారణాంతరాలవలన ఆ సంబంధం రద్దుచేసుకున్నట్లు కబురు పెట్టారు మగపెళ్ళి వాళ్ళు.

"తాంబూలాలు పుచ్చుకున్నాక ఈ సంబంధం ఎందుకు మానుకున్నట్లు వాళ్ళు? రజని అంటే కిట్టనివాళ్ళు ఎవరో దానిమీద ఏమేమి కల్పించి చెప్పారో!..." అంది కాంతమ్మ బాధగా, కోపంగా.

"అమ్మమ్మా!....రజని బంగారంలాంటి పిల్ల....అమ్మాయిమీద వాళ్ళకు ఏ విధమైన అనుమానమూ లేదు" అన్నాడు పేరయ్యగారు నొచ్చుకుంటూ.

కాంతమ్మ ఆశ్చర్యపోయింది.

"మరయితే....!!" అంది అయోమయంగా.

"ఏం లేదమ్మా....లోకం కదూ, ఏదో అర్థంపర్థంలేకుండా వాగుతూ వుంటుంది...." నసిగాడు ఆయన.

"దయచేసి ఏం జరిగిందో దాచకుండా చెప్పండి" కాంతమ్మ కుతూహలం హెచ్చింది_ఆతృత పెరిగింది.


"అదేనమ్మా!....ఇంటిలో అద్దెకుంటూన్న కుర్రాడితో పిల్ల తల్లికి సంబంధమున్నదనీ...."

భూమి గిర్రున తిరిగింది కాంతమ్మకు.

తాను తరచు సుందరమూర్తితో మాట్లాడేందుకు తన గదికి రప్పించుకోవడము....తాను అతన్ని బ్రతిమలాడుతూ చేతులు పట్టుకోవడమూ.... అండాళమ్మ రావడమూ....ఆ దృశ్యాలన్నీ ఒక్కొక్కటే కళ్ళముందు తిరిగాయి. అశనిపాతంలాంటి ఆ అపవాదుకు మూలం అండాలమ్మ రూపం....మదిలో తళుక్కుమంది_

కొరివితో తల గోక్కున్నట్లు గ్రహించడంతో — కొయ్యబారిపోయింది కాంతమ్మ.






ఆ రోజు ఆదివారం. ఇల్లంతా చెత్త ఎక్కువయి, దుమ్ము పేరుకుపోయి నానా భండాలంగా వుంది. శుభ్రంగా పెట్టెలు, చెక్కబీరువాలు అన్నీ తీసి దులిపి పనికిరానివన్నీ అవతల పారేసి, అవసరమైనవే అట్టిపెట్టాలనుకుంటూ పెట్టె ముందువేసుకుని కూర్చున్నాడు చంద్రకాంత్.

ఇంట్లో తను, తనతండ్రి తప్ప వేరే ఎవరూ లేరు. అమ్మ పోయాక తండ్రి గదిలోంచి బయటకు రావడం చాలా తక్కువ. ఒకవిధంగా వృద్ధాప్యంలో ఆయనకి భరించరాని దెబ్బకొట్టాడు భగవంతుడనే చెప్పాలి. దాన్ని ఆయన గరళకంఠుడిలా ఆ దుఃఖాన్ని దాచుకోవడానికి చేసే ప్రయత్నమే ఆ గది వదిలి పెద్దగా రాకపోవడం.

వంట అంతా అయ్యాక భోజనానికి రమ్మని పిలిస్తే అప్పుడు లేచి సావకాశంగా స్నానంచేస్తాడు శ్రీనివాసరావు.

తండ్రి రిటైరయిపోవడం_ తన తల్లి చనిపోవడం ఒక వారంలో జరగడం ఆయన్ని తీరుబడిగా కూర్చుని విచారిస్తూ వుండు అంటూ భగవంతుడు హేళన చేయడమే ననుకుంటూ వుంటాడు చంద్రకాంత్. పెట్టె తీసి దులపడం ప్రారంభించాడు.

సామాన్యంగా బిల్లులు, పాత ప్రిస్క్రిప్షన్లు, ఎప్పుడో ఎవరో పంపిన పెళ్ళి శుభలేఖలు — ఏవో కరపత్రాలు ఇత్యాదివి ఏదీ పోనీయకుండా ట్రంకు పెట్టెలో దాచడం చంద్రకాంత్